పనులు రయ్..రయ్

- పెన్నాపై శరవేగంగా రెండో బ్రిడ్జి నిర్మాణం
- గత ప్రభుత్వ హయాంలో శ్రీకారం
- పొక్లయిన్లతో ఇళ్ల తొలగింపు
- దుకాణాలకు పరిహారం లేదంటున్న అధికారులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగర పరిధిలో పెన్నాపై బ్రిడ్జిని ఎన్నో ఏళ్ల క్రితం నిర్మించారు. నెల్లూరులో జనాభా పెరగడం.. వాహనాల సంఖ్య రెట్టింపవుతుండటంతో నూతన బ్రిడ్జి నిర్మాణానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో శ్రీకారం చుట్టారు. దీనికి దాదాపు రూ.100 కోట్లను కేటాయించారు.

నిర్వాసితులకు పరిహారం

నాటి ప్రభుత్వ సంకల్పంతో నూతన బ్రిడ్జి పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. దీని ఏర్పాటుతో కొన్ని నివాసాలను తొలగించాల్సి ఉంది. నిర్వాసితులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పరిహారాన్ని అప్పట్లోనే అందజేశారు. ఈ క్రమంలో నివాసాల తొలగింపు ప్రక్రియను ముమ్మరం చేశారు. పలు గృహాలను పొక్లయిన్ల సాయంతో తొలగించారు.

నాడు పూర్తి భరోసా

ఇళ్లు కోల్పోతున్న వారికి గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ భరోసా కల్పించారు. నష్ట పరిహారంతో పాటు పోతిరెడ్డిపాళెంలో మూతపడిన కోవూరు షుగర్ ఫ్యాక్టరీలో ఇంటి స్థలాన్ని ఇస్తామని చెప్పారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం పరిహార చెల్లింపునకే పరిమితమైంది.

దుకాణ యజమానుల ఆవేదన

దుకాణాలున్న వారికి సైతం ఇదే తరహాలో స్థలాన్ని ఇస్తామని నాడు ప్రకటించారు. అయితే పరిహారాన్ని ఇవ్వబోమని ప్రస్తుత ప్రభుత్వం చెప్పడంతో వీరి పరిస్థితి అయోమయంగా మారింది. తాము 30 ఏళ్లుగా దుకాణాలను నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ప్రత్యామ్నాయం చూపకపోతే తమ పరిస్థితి ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వీరు కోరుతున్నారు.



బ్రిడ్జి నిర్మాణానికి ఏర్పాటు చేసిన పిల్లర్లు



పనుల్లో నిమగ్నమైన కూలీలు



గృహాలను తొలగిస్తున్న జేసీబీ

క్లుప్తంగా

విద్యార్థులకు ఘన సత్కారం



నెల్లూరు (టౌన్): నగరంలోని నారాయణ మెడికల్ కళాశాల ఆడిటోరియంలో నారాయణ విద్యాసంస్థల నీట్ సక్సెస్ మీట్‌ను ఆదివారం నిర్వహించారు. నీట్ – 2024లో జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి వివిధ మెడికల్ కళాశాలల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విద్యాసంస్థల జనరల్ మేనేజర్ వేమిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడారు. నారాయణ మెడికల్ అకాడమీ నుంచి దాదాపు 350 మందికి పైగా విద్యార్థులు మెడికల్ సీట్లను ఈ ఏడాది సాధించారని చెప్పారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు అలరించారు. కోర్ డీన్ విజయకుమార్, డీన్లు విష్ణువర్ధన్, శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, ఏజీఎంలు పెంచల్‌రెడ్డి, హజరత్తయ్యనాయుడు, గురవయ్య, కృష్ణారెడ్డి, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ధనుర్మాస పూజలు



పొదలకూరు: పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం నుంచి ధనుర్మాస పూజలు ప్రారంభమవుతాయని నిర్వాహకులు ఆదివారం వెల్లడించారు. ఈ పూజలు జనవరి 14వ తేదీ వరకు జరుగుతాయన్నారు. రోజూ తెల్లవారుజామున 4.30 నుంచి 6.30 గంటల వరకు ప్రత్యేక పూజలను నిర్వహిస్తామన్నారు. దంపతులు రూ.500 చెల్లిస్తే ధనుర్మాసమంతా గోత్రనామాలతో పూజలు చేయిస్తామని తెలిపారు.

గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు



మనుబోలు: మండల కేంద్రమైన మనుబోలు గ్రామదేవతలు మనుబోలమ్మ, నాగార్పమ్మలకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు ఫణీంద్ర శర్మ పంచామృతాభిషేకాలు చేశారు. ప్రత్యేకాలంకరణ అనంతరం విశేష పూజలు జరిపించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. స్థానికులు అధిక సంఖ్యలో గ్రామదేవతలను దర్శించుకున్నారు.

కోడూరు చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు

తోటపల్లిగూడూరు: మండలంలోని కోడూరు వేళాంగిణి చర్చిలో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఈ సందర్భంగా చర్చి డైరెక్టర్ ఫాదర్ లూకాస్‌రాజ్ సందేశాన్నిచ్చారు. వేళాంగిణిమాతను నమ్మితే సకల సౌఖ్యాలు సిద్ధిస్తాయని పేర్కొన్నారు. అమ్మను సేవించి పుణ్యక్షేత్రంలో జాగరణ చేస్తే కష్టాలు తీరిపోతాయన్నారు. జిల్లా నలువైపుల నుంచి అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు.

జాతీయ పింఛనర్ల దినోత్సవం రేపు

నెల్లూరు(బృందావనం): భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని మంగళవారం ఉదయం నిర్వహించనున్నామని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్సెమ్ గౌస్, ఎస్వీవీఎస్ మూర్తి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి భారీగా తరలిరావాలని కోరారు.

సూర్యకాంతం శతజయంతి రేపు

నెల్లూరు(బృందావనం): పురమందిర ప్రాంగణంలోని వర్ధమాన సమాజ హాల్లో నటి సూర్యకాంతం శత జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించనున్నామని చేతన సంగీత, సాహిత్య సాంస్కృతిక వేదిక నిర్వాహకులు సుబ్రహ్మణ్యం, శేషగిరీశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భారీగా హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రజల ఆదరణ మరువలేనిది



మాట్లాడుతున్న చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నగరంలోని 16వ డివిజన్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై ప్రజలు చూపిన ఆదరణ మరువలేనిదని ఎమ్మెల్సీ, పార్టీ నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన డివిజన్ కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో పార్టీ విజయం కోసం డివిజన్లోని అనేక మంది నేతలు కృషి చేశారని చెప్పారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ.. కార్యకర్తలకు ఏ కష్టమొచ్చినా, పార్టీ అండగా ఉంటుందనే భరోసాను కల్పించాలని సూచించారు. డివిజన్లో ప్రాధాన్యమున్న మరికొందరు నేతలకు పార్టీ కమిటీల్లో స్థానం కల్పిస్తామని చెప్పారు. అనంతరం పార్టీ డివిజన్ అధ్యక్షుడిగా నేత సగిలి జయరామిరెడ్డిని నియమించారు.

ఘనంగా హిందీ గాన జయంతి



నెల్లూరు(బృందావనం): క్రీస్తు జనన వృత్తాంతాన్ని పాటల రూపంలో అందించే హిందీ సంగీతోత్సవ గాన జయంతిని నగరంలో ఆదివారం నిర్వహించారు. వీఆర్సీ సెంటర్ సమీపంలోని బాప్టిస్ట్ చర్చి డౌనీ హాల్లో సంఘ కార్యదర్శి గుర్రం అరుణ్‌కుమార్, బ్రదర్ జానీజో ఆధ్వర్యంలో నిర్వహించిన సంగీత కార్యక్రమానికి సాహిత్యాన్ని మీనా రజనీష్, క్రిస్టఫర్ అందించారు. స్వరకల్పన, సంగీతాన్ని గుర్రం సుధాకర్‌రావు, జమ్ముల జయకుమార్, జెన్నీ జోయల్ శ్యామ్ అందజేశారు. సంఘ కాపరి రెవరెండ్ కంది శ్యామ్‌సన్‌కుమార్ వాక్యోపదేశం చేశారు. అనంతరం క్రిస్మస్ కేక్‌ను కట్ చేశారు. గాయక బృందం మహేష్, కల్యాణ్, అనిల్, జితేందర్ పల్వాన్, సింధు, సాత్విక్, క్రిస్టీ, విహారి, సంఘ పెద్దలు నిర్మల సుధాకర్, గంటా జార్జిస్టీవెన్సన్, కృపారాజన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీర్ల సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా రియాజ్



నెల్లూరు(అర్బన్): రాష్ట్ర పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ గౌరవాధ్యక్షుడిగా నెల్లూరుకు చెందిన రియాజ్ అహ్మద్‌ను తిరిగి ఎన్నుకున్నారు. తిరుపతిలోని ఓ కన్వెన్షన్ హాల్లో సంఘ రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను ఎన్నుకున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో పంచాయతీరాజ్ డిప్లొమా ఇంజినీర్ల సంఘ అధ్యక్షుడిగా, రాష్ట్ర జేఏసీలో వైస్ చైర్మన్‌గా పనిచేశారు. ఉద్యోగ విరమణ పొందినా రాష్ట్ర గౌరవాధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. పూర్వ ఉద్యోగ సంఘ జేఏసీ చైర్మన్ అశోక్‌బాబు, ప్రస్తుత చైర్మన్ శివారెడ్డి అభినందించారు.

వాకర్స్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలను ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఎన్నికల అధికారి కనకట్ల రఘురామ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా పాబోలు వెంకటసత్యనారాయణ, కార్యదర్శిగా తుమ్మల పెంట సురేష్, కోశాధికారిగా గాలి రఘురామయ్యనాయుడు, గౌరవాధ్యక్షుడిగా రామానాయుడ్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కిలారి తిరుపతినాయుడు, వేలూరు రంగారావు, బాసం శేషగిరిరావు, దాసరి అనంతరామారావు, గుర్రం సురేంద్ర, అరిగెల సాయిరామ్, తలారి బాలసుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ శాఖ అధికారి కార్యాలయ ప్రారంభం



నెల్లూరు(బృందావనం): దేవదాయ శాఖ జిల్లా అధికారి నూతన కార్యాలయ భవనాన్ని రంగనాయకులపేటలోని చిత్రకూటంలో ఆదివారం ప్రారంభించారు. గృహ ప్రవేశం, దివ్య ప్రబంధ సేవాకాలం, వాస్తు హోమాన్ని నిర్వహించారు. దేవదాయ శాఖ, తల్పగిరి రంగనాథస్వామి దేవస్థాన అనుబంధ సంస్థ ముప్పిరాల నరసింహాచార్యులు నిర్దిష్ట ధర్మదాయం నుంచి కార్యాలయాన్ని నిర్మించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, రంగడి దేవస్థాన ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంగనాథస్వామి దేవస్థానంలో విశేష పూజలు





నెల్లూరు(బృందావనం): నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. దీపారాధన, లంకా దహనం, రంగనాథుడి పేట ఉత్సవాన్ని జరిపారు. ఉభయకర్తలుగా మాడిశెట్టి గురునాథం, సరోజ దంపతులు వ్యవహరించారు. దేవదాయ శాఖ జిల్లా అధికారి కోవూరు జనార్దన్‌రెడ్డి, ఈఓ ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చండీ హోమం



నెల్లూరు(బృందావనం): మార్గశిర పూర్ణిమను పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీ హోమాన్ని భక్తిశ్రద్ధలతో ఆదివారం నిర్వహించారు. మఠం ప్రాంగణంలోని కామాక్షి సమేత చంద్రమౌళీశ్వరస్వామికి పూజలు చేశారు. ఉభయకర్తలుగా వెంకటసుబ్బయ్య దంపతులు వ్యవహరించారు. మఠం నిర్వాహకులు కొర్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు పర్యవేక్షించారు.

పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న పర్వతరెడ్డి

నెల్లూరు(బారకాసు): అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని నగరంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటాలకు నివాళులర్పించి సేవలను కొనియాడారు.

- ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం వెలకట్టలేనిదని ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జి పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. రామ్‌జీనగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు వేలూరు ఉమామహేష్, ఊటుకూరు నాగార్జున, జయలక్ష్మి, పార్టీ నేతలు పేర్నేటి కోటేశ్వరరెడ్డి, సురేంద్ర, ధనుజారెడ్డి, జయరామిరెడ్డి, రవూఫ్, పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.
- నగరపాలక సంస్థ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి మేయర్ స్రవంతి, కమిషనర్ సూర్యతేజ నివాళులర్పించారు. కార్పొరేటర్ సత్తార్ బాషా, కార్పొరేషన్ మేనేజర్ ఇనాయతుల్లా, డీఈఈ రఘురామ్ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు (టౌన్): పొట్టి శ్రీరాములు ఆత్మార్పణ.. ఉక్కు మనిషి వల్లభ్‌భాయ్‌పటేల్ దృఢ సంకల్పం నేటి యువతకు ఆదర్శమని ఆర్‌ఐఓ శ్రీనివాసులు పేర్కొన్నారు. నగరంలోని డీకేడబ్ల్యూ జూనియర్ కళాశాలలో వీరి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు వివిధ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఇన్‌చార్జి ప్రిన్సిపల్ కొండయ్య, ఎన్నెస్సెస్ ప్రోగ్రామ్ అధికారులు కరుణకుమారి, భారతి, అధ్యాపకులు వెంకట్రావు, వెంకటేశ్వర్లు, శ్రీధర్, కృష్ణవేణి, సమత, కృష్ణతులసి, లలిత తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో..



డీకేడబ్ల్యూలో..

బాబోయ్.. దోమలు



ఇళ్ల మధ్యే పశువుల పెంపకం

- పేరుకుపోతున్న పేడ దిబ్బలు
- బెంబేలెత్తుతున్న ప్రజలు

నెల్లూరు (పొగతోట): నగరంలో దోమల బెడద నానాటికీ అధికమవుతోంది. జీవాలను జనావాసాల మధ్య కట్టేయడం.. పేరుకుపోతున్న పేడ దిబ్బల కారణంగా సమస్య జటిలమవుతోంది. బాలాజీనగర్, ఏసీనగర్ తదితర ప్రాంతాల్లో ఈ తంతు ఎక్కువవుతోంది. ఇక్కడ ఖాళీ స్థలం కనిపిస్తే ఆక్రమించి గేదెలను కట్టేస్తున్నారు. పేడను దూర ప్రాంతాల్లో కాకుండా అక్కడే వేస్తుండటంతో దుర్గంధం వెదజల్లడంతో పాటు దోమల మోత తీవ్రమవుతోంది. ఫలితంగా వ్యాధులు వస్తాయేమోనని స్థానికులు ఆందోళనకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యను పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



ఏర్పాటు చేసిన షెడ్లు

ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వమే భరించాలి



విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): విద్యుత్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటును వ్యతిరేకిస్తున్నామని.. వీటిని ఏర్పాటు చేస్తే ధ్వంసం చేయాలని గత ఎన్నికల సమయంలో చంద్రబాబు, లోకేష్, పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారని, అయితే వీటి ఏర్పాటుకు ప్రస్తుతం కంకణం కట్టుకున్నారని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు ఆరోపించారు. వెంకటేశ్వరపురంలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసనను పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం చేపట్టారు. తొలుత జనార్దన్‌రెడ్డికాలనీ సెంటర్ నుంచి ర్యాలీ చేపట్టి విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ట్రూ అప్ భారం రూ.18 వేల కోట్లను ప్రజలపై మోపారని, వీటిని ప్రభుత్వమే భరించాలని డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, ట్రూ అప్ చార్జీల భారంపై ప్రజలకు అవగాహన కల్పించి.. వారిని ఉద్యమంలో భాగం చేయనున్నామని చెప్పారు. అనంతరం ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నేతలు మూలం ప్రసాద్, నాగేశ్వరరావు, కత్తి పద్మ, జాఫర్, మంజులమ్మ, భాగ్యమ్మ, కరిముల్లా, సురేష్, వెంకటేశ్వర్లు, బయ్యన్న, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కళా సేవలు అభినందనీయం



నెల్లూరు(బృందావనం): కళారంగానికి కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు కేతా సుబ్బారావు అందిస్తున్న సేవలు ఎనలేనివని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. మాగుంట లేఅవుట్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్వాహకుడు కుమార్ ఆధ్వర్యంలో కేతా సుబ్బారావును ఆదివారం సత్కరించారు. గోవర్ధన్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.